# సంఘ బలి

శ్రీ ఆయపిళ్ల రామారావు

"వేణూ!...వేణూ—వేణూ!"

"ఎవరు.",

"నేను...కమలని"

గప్పున తలుపుతెరచి "ఏం కమలా ఇంత రాత్రప్పుడెల్లా రాగలిగావు!" అన్నాడు వేణుఅదోలా కమలకేసి చూస్తో.

"ఆఁ ఏమీలేదూ. నువ్వు తీసుకున్న క్రొత్తలాడ్జి యెల్లావుందో అని వచ్చాను."

గాభరాతో "నేనీ లాడ్జిలో దిగానని నీకెల్లా తెలిసింది కమలం" అన్నాడు వేణు.

"పాపం! పిల్లికళ్లు మూసుకొని పాలు త్రాగుతూ 'జగమెల్లా చీకటే' అనుకుందిట. నువ్వు [illegible] లాడ్జిలో రాత్రికి రాత్రి దిగావని ఎవరికి తెలియదనుకున్నావు కామోసు. సరేకాని నీతో నేనదికంగా మాట్లాడటానికి అవకాశంలేదు. నేనొకటడుగు తాను అది చేస్తావ్."

"ఏమిటి కమలా ఆది"

"వేణూ. మన యిద్దరి చేష్టలు తుదకెల్లా పరిణమించాయో తెలుసుకున్నా వనుకుంటాను. బహుశ ఆ సంగతి తెలిసే నువ్వు మావీధి కొట్టు రాత్రికి రాత్రిఖాళీ చేసి యీలాడ్జిలో ప్రవేశించా వనుకుంటా. మరచిపొయ్యావు మన ప్రేమాలాపాలు. 'కమలం నీలాంటి అందకత్తె మరేలోకంలోనూ ఉండదనేతలస్తా. బ్రహ్మదులడ్డగించినా సరే, నువ్వు నాదానివే.' అని నువన్న మాటలు నువ్వు మాయింట్లో లాడ్జి తీసుకున్న కొత్తరికంలో యెన్ని విధాలుగా నన్నాకర్షించడానికి ప్రయత్నించేవాడివో జ్ఞాపకముందా? నేను బయటికి వచ్చేసరికల్లా యేదో ఓ శృంగార చేష్ట చేస్తువుండేవాడివి. నేనల్లా వెడుతోవుంటే కూనిరాగం తీస్తో నావంక అదోలా చూసేవాడివి. నేను నీవైపు చూసేసరికల్లా ఒక చిన్న నవ్వు నవ్వేవాడివి. ఆనవ్వే నన్నుతన్మయం యెత్తించేది. నేను బయటున్నప్పుడు నీవుండే కొట్టు కెదురుంగా వుండే కొట్లోనే కూర్చునే దాన్ని. ఆమూడు రోజులూ నువ్వు యించు మించుగా కాలేజీకి వెళ్ళటమే మానేసేవాడివి కదూ. గ్రామఫోనుయెక్కడనుంచో తెచ్చి వెయ్యటం— నీ సన్నని కంఠంతో కూనిరాగాలు తీస్తో పచార్లు చేస్తు లాడ్జిలోనే ఉండిపొయ్యేవాడివి. ఆమూడు రోజులూ ఏవో పత్రికలు ఊసుపోవటానికి చదువుకో మని చెప్పి పంపేవాడివి. ఆరోజున జ్ఞాపకముందీ, నేను ఉదయం చీకటితోనే నీళ్ళోసుకుని యింట్లో కెళుతోంటే ఒకపత్రికని అందిస్తు జాగ్రత్తగా చదువు అందులో మంచి మంచి సంగతులున్నాయి. అని నువ్వన్నావు కదూ. బహుశా అదే నువ్వునన్ను తొలిసారి స్పృశించడం అనుకుంటా. నేను అప్రయత్నంగా నీచేతులో పుస్తకాన్ని అందుకుంటూంటే నీవేళ్ళని నాచేతికి తగిలేట్టు అందించేవు. ఆరోజునే నువ్వు వ్రాసిన ప్రణయలేఖని ఆ పుస్తకంలో చూడటం. ఆ వుత్తరం చూసీ చూట్టంతోనే నా ఒళ్ళంతా అదోమోస్తరుగా కంపించడం ఆరంభించింది. గుండెలు భారంగా కొట్టుకోవటం మొదలెట్టాయి. నిన్నవేళ చూడటానికి నాకు సిగ్గనిపించింది. ఆసాయంకాలమే కదూ మావాళ్ళింట్లో లేని సమయంలో "కొంచం నీళ్ళిస్తావా అంటూ వాకిట్లో కొచ్చి అడిగావు. నేను గ్లాసుతో నీళ్ళందిస్తోంటే 'ఎందుకల్లా చెయ్యివణుకుతోంది. యింట్లో యెవరూ లేరుకద' అన్నావు కదూ నువ్వు. 'ఎవరూలేర' నిచెప్పటంతోటే కథాంజలి పుస్తకం అంతా చూసావా అన్నావు నువ్వు. మంచినీళ్లు త్రాగేసి గాసు నాకందిస్తో నాచెయ్యి పట్టుకుని నేను భయంతో యిటూ అటూ చూస్తుంటే భయంలేదు కమలా ఎవ్వరూ లేరు. వీధితలుపు గడియవేసేవచ్చా నన్నావు నువ్వు. ఏవేవో మాట్లాడి నన్ను ఒప్పించావు. అంతలో మా అమ్మతలుపు తట్టడంవల్ల నువ్వు దొడ్డివెంట వెళ్లిపొయ్యావుకదూ అదిలగాయితూ మనం కలుసుకోని రాత్రే లేదేమో అనుకుంటా, కాని కాలం ఒక్కలా వెడుతుందా, నేను ప్రతిదినం ఏమవుతుందో అని భయపడుతూ నీతోఅంటే 'భయపడతా వేమిటి కమలం. నాకంఠంలో జీవం వుండగా నిన్ను విడుస్తానా. పాపిష్టి సంఘానికీ లోకానికీ జడుస్తా ననుకున్నావా' అని నాకు నచ్చచెప్పే వాడివి కదూ—అవన్నీ నిజమేకాబో లనుకున్నా. అవివాహి

తప్పైనా నాకేం భయంలేదనుకునే దాన్ని, నాకు... అయిందన్న సంగతి పైవాళ్లకి తెలియకుండానే మా వీధి కొట్టు ఖాళీచేసివచ్చావు. వేణూ, మా అమ్మా నాన్న యీ సంగతి గ్రహించారు: లోకానికీ సంఘానికీ వెరచి యీ అపవాదు తీరటానికి నన్నో ముసలి పీనుగకిచ్చి బలియిద్దామని ఆలోచిస్తూన్నారు. ఇవ్వాళ శిరాత్రి మానాన్న మా అమ్మతో సంబంధం రైటయిందని వరుడు యీడు ముదిరినా డబ్బున్నవాడనిఅల్లాంటి వాళ్ల యింట్లో నేను పడితే మరి అపవాదే ఉండదని అంటూంటే విన్నాను. ఇంకేవో అనుకున్నారు.అవన్నీ తలుపుచాట్నుంచి నేను వినగానే నాకు జీవితంమీద ఆశపోయింది వేణూ. ఆఖరుగా ఒక్కమాట నిన్నడిగి చేదామని యిల్లావచ్చాను. ఇదిగో! నావంటిని సుమారు 15 తుల్లాల బంగారంవుంది. పాపిష్టి సంఘం ఈవూళ్లో మనంవుంటే సహించలేదేమో. నేను నా బంగారంతో సహా నీ ఆధీనం అయిపోతాను. నీయిష్టంవచ్చిన చోటికి పోదాం. నువ్వు బి. ఏ. చదువుతున్నావు కద. నాబంగారం అయిపొయ్యేలోగా నువ్వెక్కడేనా పదిరాళ్లు సంపాదించే మార్గం చూడవచ్చు. ఆలస్యం చెయ్యటానికీ మాత్రం అవకాశం లేదు...లే మరి.

"నన్ను క్షమించు కమలం."

"ఏమన్నావు క్షమించమంటున్నావా... యిదే నానీవు చదువుకుంటూ దేశానికి చేస్తూన్న ఉపకారం. నీలాంటివాళ్ళు చదువుకుని ఉన్నతా దర్శాలని దేశంలో నెలకొల్పి భారతమాత శృంఖలాన్ని విడగొడ్తారనే కొందరి వూహలు గాలిలో మేడలేనా. ఒక్కసారి ఆలోచించు. అప్పుడే రెండు కావస్తుంది......ఏమంటావు."

"నాకప్పుడే వివాహం అయింది కమలం"

"ఆఁ నీకు వివాహంయిదివరకే అయిందా...ఛీ పురుషులు...పశువులకంటె నీచంగా ప్రవర్తిస్తూన్నారు స్త్రీల విషయంలో...నాకింకా పెళ్లికాలేదని బొంకావే...పాపం నాలాంటిదే ఆమెకూడా. ఎంత అవినీతికరమైన పని చేసావు వేణూ. నీలాంటి విద్యార్థులు—భారతీయ సౌభాగ్యానికి కారకులమని చెప్పుకుని తిరుగుతో వందలుకు వందలు వేలకు వేలు తగలేస్తూ బి. ఏ. యమ్. ఏ. లు చదువుతున్నామని విర్రవీగుతో ఎంతమంది నాలాంటి అవివాహిత లైన—భారత నారీమణులై దేశమాతకి దివ్యకుసుమాల్ని సమర్పించటానికి సిద్ధముగావుండి సంఘంలోవున్న దురాచారాలని తీవ్రంగాఎదుర్కోడానికి సిద్ధముగాయున్న—ఎందరు మానవతుల శీలాన్ని చెరుపుతూన్నారో, నా శీలాన్ని భంగంచేసావు. నన్ను యీసంఘానికి బలిగా ఇయ్యటానికి కూడా పూనుకున్నావు. మనస్ఫూర్తిగా ప్రేమించినవాడల్లే నటించి ప్రేమింప చేసుకుని తుదకు నన్ను అధోగతిపాలు చెయ్యటానికి కూడా సాహసించావు. పాపం! యీ చుట్టుపట్ల యెవరూ నాలాంటి అనాథలు లేరుకద భారత స్వాతంత్ర్యానికి ముఖ్యకారకులుస్త్రీలే అంటారే మహాత్ములు. అలాంటి స్త్రీలని మీవిలాసాల కోసం సంఘానికి బలియిస్తున్నారు...సరే యింకనీతో ఏంచేసి ఏంలాభం. నీకుమాత్రం యివన్నీ తెలీవనా. ఇకముందైనా తెలివి తెచ్చుకో నాకింక యీలోకంలో ఉండటానికి అవసరంలేదు." అంటూ గదిదాటి తిరుగా తలుపు చేరవేసింది కమల.

* * *

మరునాడు శివాలయం దగ్గర నూతులోంచి తీశారు కమలం శవాన్ని.

* * *

ఆమె చావునిగూర్చి అనేక విధాలుగాఅనుకుంటారు ప్రజలు. మొత్తానికి ఏదోవిధంగా సంఘానికి బలి అయిందంటారు బుద్ధిమంతులు.

* * *

కొన్నాళ్ళకు ఆమెనిగురించిన ప్రశంసే వుండదు లోకం అంతా మరుస్తుందామెని.

"కథాంజలి"

అన్ని హిగ్గిన్ బాతమ్సు
రైల్వే బుక్ స్టాల్సులోన్ను
దొరుకుతుంది.